# పెద్ద మనుషుల ఒప్పందం ఇదీ!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడక ముందు తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల నాయకుల మధ్య 1956లో ఒక ఒప్పందం కుదిరింది. దీన్నే పెద్ద మనుషుల ఒప్పందంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఒప్పందంపై ఆంధ్రాప్రాంతం నుంచి అప్పటి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, గౌతు లచ్చన్న, అల్లూరి సత్యనారాయణ రాజు; తెలంగాణ ప్రాంతం నుంచి అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి.నర్సింగ్‌రావులు సంతకాలు చేశారు. ఒప్పందంలో పేర్కొన్న అంశాలు..

## ఆంధ్ర ప్రాంత నేతలు



బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, గౌతు లచ్చన్న

## తెలంగాణ ప్రాంత నేతలు



బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, కె.వి.రంగారెడ్డి

**1** ఆంధ్రప్రదేశ్ మొత్తానికి ఒకే శాసనసభ ఉంటుంది. రాష్ట్రానికి చట్టాలు రూపొందించే వ్యవస్థ ఇదేఅవుతుంది. రాష్ట్రానికి ఒక గవర్నర్ ఉంటారు. మొత్తం పరిపాలనకు సంబంధించి రాష్ట్రశాసన సభకుజవాబుదారీగా వ్యవహరించే మంత్రి మండలి గవర్నర్‌కు సహాయకారిగా ఉంటూ సలహాలిస్తుంది.

**2** కొన్ని ప్రత్యేక అంశాలకు (స్పెసిఫిక్ మేటర్స్) సంబంధించి ప్రభుత్వ వ్యవహారాల నిర్వహణను మరింత సులభతరం చేసేందుకు తెలంగాణ ప్రదేశాన్ని ఒక ప్రాంతంగా పరిగణిస్తారు.

**3** తెలంగాణ ప్రాంతం కోసం రాష్ట్ర శాసనసభకు చెందిన ఒక ప్రాంతీయ స్థాయీ సంఘం (రీజినల్ స్టాండింగ్ కమిటీ) ఉంటుంది. ఇందులో ఆ ప్రాంతానికి చెందిన మంత్రులు, ఆ ప్రాంతానికి చెందిన రాష్ట్ర శాసన సభ సభ్యులు ఉంటారు. ముఖ్యమంత్రికి ఇందులో స్థానం ఉండదు.

**4** ప్రత్యేక అంశాలకు సంబంధించిన చట్టాలను ప్రాంతీయ సంఘం సమాలోచనలకు పంపాలి. ప్రత్యేక అంశాలకు సంబంధించి చట్టం చేయడం కోసం ప్రాంతీయ సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేయొచ్చు.. లేదా ఆర్థిక భారం పడని సాధారణ విధానాలకు సబంధించి చట్టం చేయడం కోసం ప్రతిపాదనలు చేయొచ్చు.

**5** ప్రాంతీయ సంఘం ఇచ్చే సలహాలను రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర శాసనసభ సాధారణంగా ఆమోదించాలి. ఒక వేళ భిన్నాభిప్రాయాలు వ్యక్తమైతే గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాలి. గవర్నర్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండాలి.

**6** ప్రాంతీయ సంఘం ఈ కింది విషయాలను పరిశీలిస్తుంది.

- రాష్ట్ర శాసనసభ రూపొందించిన సాధారణ అభివృద్ధి ప్రణాళికల చట్రం పరిధిలో అభివృద్ధి, ఆర్థిక ప్రణాళికలు
- స్థానిక స్వీయ ప్రభుత్వం... అంటే గ్రామీణ పరిపాలన, స్థానిక పరిపాలన నిమిత్తం పురపాలక సంఘాలు, అభివృద్ధి సంస్థలు, జిల్లా బోర్డులు, జిల్లా సంస్థలకు సంక్రమించే రాజ్యాంగబద్ధ అధికారాలను పరిశీలిస్తుంది.
- ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, స్థానిక ఆస్పత్రులు, వైద్యశాలలు(డిస్పెన్సరీలు)
- ప్రాథమిక, మాధ్యమిక విద్య
- తెలంగాణ ప్రాంతంలోని విద్యాసంస్థల్లో ప్రవేశాల నియంత్రణ
- మద్యపాన నిషేధం- వ్యవసాయ భూముల విక్రయం
- కుటీర, చిన్న తరహా పరిశ్రమలు, వ్యవసాయం, సహకార సంఘాలు, మార్కెట్లు, సంతలు. ఒప్పందాన్ని ముందుగానే సవరించని పక్షంలో ఈ ఒప్పందాన్ని పదేళ్ల తర్వాత సమీక్షించాలి.

**7** 'స్థానిక' (డొమిసైల్) నియమాలు: సబార్డినేట్ సర్వీసుల భర్తీ విషయంలో తెలంగాణను ఒక యూనిట్‌గా పరిగణనలోకి తీసుకునే విధంగా ఐదేళ్లపాటు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలి. ఈ కేడర్‌లోని పోస్టులను ప్రస్తుత ముల్కీ నిబంధనల (తెలంగాణ ప్రాంతంలో 12 ఏళ్ల పాటు ఉండి ఉండాలి) పరిధిలోకి వచ్చే వారి కోసం రిజర్వు చేయొచ్చు.

**8** తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల మధ్య వ్యయాల పంపిణీ: రాష్ట్ర వనరుల ద్వారా కేటాయించే వ్యయాల అంశం రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర శాసనసభల పరిధిలోనిదే. కేంద్రీకృత, సాధారణ పరిపాలన నిమిత్తం కొత్త రాష్ట్రం వెచ్చించే వ్యయాన్ని రెండు ప్రాంతాలు నైష్పత్తికంగా భరించాలి. ఆదాయంలో మిగులును మాత్రం తెలంగాణ అభివృద్ధి నిమిత్తం వెచ్చించే వ్యయం కోసం అట్టిపెట్టాలి. బడ్జెట్ కేటాయింపులు చేసేటప్పుడు.. ప్రభుత్వం.. ఒప్పందంలోని షరతుల మేరకు వ్యవహరించాలి. ఈ అవగాహన గురించి భారత ప్రభుత్వం ఆంధ్ర ముఖ్యమంత్రికి గుర్తు చేయాలి.

**9** తెలంగాణలో సాంకేతికవిద్య సహా ప్రస్తుతమున్న విద్యావసతులను తెలంగాణ విద్యార్థుల కోసం పరిరక్షించాలి, ఇంకా మెరుగుపర్చాలి.

**10** ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి 60:40 నిష్పత్తిలో మంత్రి వర్గ సభ్యులుండాలి. తెలంగాణ మంత్రుల్లో (మంత్రివర్గంలో 40 శాతం మంది) తెలంగాణ నుంచి ఒక ముస్లిం ఉండాలి. ఒక ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి ఉంటే మరో ప్రాంతం నుంచి ఉపముఖ్యమంత్రి ఉండాలి.

గమనిక: పెద్దమనుషుల ఒప్పందం ఆంగ్ల ప్రతికి ఇది సరళానుసరణ

– న్యూస్‌టుడే యంత్రాంగం